నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
మంగళవారం | 06 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఆసక్తి కలిగిన పాఠశాల నుంచి దరఖాస్తులును ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల రెసిడెన్షియల్ సౌకర్యం ఉన్నట్లయితే వారికి రెసిడెన్షియల్ విద్యార్థులను కేటాయించే ప్రతి విద్యార్థికి విద్యా బోధన, వసతి, భోజనం ఏర్పాట్లు నిమిత్తం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ మొదలగునవి సరఫరా చేయాల్సి ఉంటుందని.. ప్రతి విద్యార్థికి రూ.42,000 వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. హాస్టల్ వసతి లేని పాఠశాలకు డే స్కాలర్ కేటాయించి వారికి విద్య బోధన, బోధనతో పాటు యూనిఫామ్, మొదలగు వాటి నిమిత్తం పాఠశాల డే స్కాలర్ ఫీజు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు రూ.25000, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు రూ.28,000 చెల్లించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారం జిల్లా షెడ్యూల్ కులం అభివృద్ధి అధికారి కార్యాలయంలో లభిస్తాయన్నారు. దరఖాస్తులను కార్యాలయం అందజేయాలన్నారు. ఇతర వివరా లకై జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం ఫోన్ నెంబర్ 8328508067కు సంప్రదించాలన్నారు.

హుసేల్లి, గుంజేటీలో పాత పంటల జాతర



నవతెలంగాణ-న్యాల్‌కల్

డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ పాత పంటల జాతరకు సంబంధించిన ఎడ్లబండ్ల ఊరేగింపు సోమవారం మండల పరిధిలోని హుసేల్లి, గుంజేటి గ్రామాల్లో సాగింది. బండ్ల ముందర మహిళలు ఆటాపాటలతో ఊరేగింపు నిర్వహిస్తూ చిరుధన్యాల ప్రాధాన్యతను తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఆరోగ్య జీవన విధానానికి చిరు ధాన్యాలను అలవాటు చేసుకోవాలన్నారు. బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులు నయం కావాలంటే చిరుధాన్యాలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బ్యాత చంద్రప్ప, డీడీఎస్ సూపర్‌వైజర్ వినయ్ కుమార్, సిబ్బంది నరసమ్మ, కమలమ్మ, మంజుల, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- పదో తరగతి బాలికకు తరచూ వేధింపులు
- కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో ఆగ్రహంతో పాఠశాలకు..
- ఎదురుపడిన క్లాస్ టీచర్‌పై దాడి చేసిన బంధువులు

నవతెలంగాణ-నంగునూరు

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ కీచకుడిగా మారి ఇబ్బందులకు గురిచేశాడు. నంగునూర్ మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ టీచర్ తిరుపతి.. అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో గత కొన్ని రోజులుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత శనివారం ల్యాబ్‌రూమ్‌కు రమ్మని విద్యార్థినితో అనుచితంగా వ్యవహరించాడు. దాంతో బాలిక ఆ విషయాన్ని క్లాస్ టీచర్‌తో పాటు తన కుటుంబీకులకు తెలిపింది. ఈ క్రమంలో సోమ వారం ఉదయం గ్రామస్తులతో కలిసి బాలిక కుటుంబ సభ్యులు పాఠశాలకు వెళ్లారు. పాఠశాలలో జరిగిన విషయంపై ఉపాధ్యాయులతో మాట్లాడుతుండగా.. బాలికకు సంబంధించిన సిద్దిపేటకు చెందిన బంధువులు సదరు ఉపాధ్యాయుడి గురించి ఆరాతీస్తుండగా ఎదురు పడిన క్లాస్ టీచర్‌పై దాడి చేశారు. అప్పటికే వేరే క్లాసులో ఉన్న తిరుపతిని స్థానిక ఉపాధ్యాయులు తప్పించినట్టు వారు ఆరోపించారు. కాగా అక్కడే ఉన్న గ్రామస్తులు దాడిని అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట పోలీసులు అక్కడకు చేరుకొని ఇరు వర్గాలకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకు న్నారు. అనంతరం గ్రామస్తులు ఉపాధ్యాయులతో మాట్లాడు తూ.. అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. కాగా స్థానిక నాయకులు జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినట్టు సమాచారం. ఘటనకు కారణమైన ఉపాధ్యాయుడితో క్షమాపణ చెప్పించినట్టు తెలిసింది.

పని వేళల్లో ఇంటికి..

పంచాయతీ సెక్రటరీకి మెమో జారీ చేసిన ఎంపీఓ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శిలు ఉదయం 8 గంటలకు విధులకు హాజరై.. పారిశుద్ధ్య కార్మికుల ఫోటో కనపడే విధంగా పై అధికారులకు సమాచారం పంపించాలి. కానీ సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని చింతమడక పంచాయతీ కార్యదర్శి సురేష్.. సోమవారం రోజున విధులకు హాజరైనట్టు ఫోటో రాకపోవడంతో ఎంపీఓ హరిప్రసాద్ ఆకస్మికంగా గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ లేకపోవడంతో పంచాయతీ నర్సరీ దగ్గరకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. అయితే తన ఆరోగ్యం బాగాలేనందున ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అయితే గ్రామ పంచాయతీకి తిరిగి రావాలని ఎంపీఓ చెప్పగా.. వస్తానని చెప్పి రాలేదు. దాంతో ఎంపీఓ మరోమారు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మధ్యాహ్నం వరకు గ్రామ పంచాయతీ వద్ద వేచి ఉన్నప్పటికీ సెక్రటరీ రాలేదు. అంతేకాకుండా పంచాయతీకి రావట్లేదని కనీసం మండల పంచాయతీ అధికారికి కూడా సమాచారం ఇవ్వలేదు. పంచాయతీ కార్యాలయం నుంచి వెళ్ళవలసి వస్తే ముందస్తుగా పై అధికారుల నుంచి అనుమతి పొందాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ సదరు సెక్రటరీ ఈ నిబంధనలు ఉల్లంఘించి.. పై అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందకుండా కార్యాలయ పనివేళల్లో గ్రామ పంచాయతీ నుంచి ఇంటికి వెళ్లాడని.. కాబట్టి నేటి మధ్యాహ్నం లోపు తగు ఆధారాలతో రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని ఎంపీ హరిప్రసాద్ మెమో జారీ చేశారు.



మంజీరా హైస్కూల్ విద్యార్థులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్సీ వెల్ఫేర్ ద్వారా ఇస్నాపూర్‌లోని మంజీరా హైస్కూల్‌లో సీబీఎస్సీ సెలబస్ లేనప్పటికీ ఉన్నదని మోసం చేసి 25 మంది విద్యార్థులను పాఠశాల యాజమాన్యం మోసం చేసిందని.. ఆ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి కిరణ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇస్నాపూర్‌లో ఉన్న మంజీరా రెసిడెన్షియల్ హైస్కూల్ స్టేట్ సిలబస్‌తో కొన్నేండ్లు తరగతులను నడిపించిందన్నారు. అయితే ఆ పాఠశాలలో సీబీఎస్సీ సెలబస్‌కు అనుమతులు లేప్పటికీ.. ఉన్నాయని నమ్మించి ఎస్సీ వెల్ఫేర్ (బెస్ట్ అవలేబుల్) నుంచి ఎన్నికైన 25 మంది విద్యార్థులకు అడ్మిషన్‌లు తీసుకున్నారన్నారు. అనుమతులు లేనప్పటికీ ఆ విద్యార్థులకు ఎందుకు అడ్మిషన్ తీసుకున్నారని ప్రశ్నించారు. వెంటనే సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. విద్యార్థుల స్టేట్ సిలబస్ ఉన్న మరో బ్రాంచ్‌కు మార్చాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు.

నవతెలంగాణ-మునిపల్లి

సర్పంచుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా మండల పరిధిలోని తాటిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా గత ఐదేండ్ల నుంచి గ్రామాభివృద్ధి కోసం కృషి చేసిన గ్రామ సర్పంచ్ అంజిరెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ అంజిరెడ్డి మాటాడుతూ.. తమ హయాంలో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. తనపై నమ్మకంతో గత ఎన్నికల్లో గెలిపించిన గ్రామ ప్రజలందరికి ఎల్లవేళలా అందుబా టులో ఉండి సేవ చేస్తానన్నారు. గ్రామాభివృద్ధి కోసం సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ కేసుల కొట్టివేత

- పోరాట నాయకులకు అనుకూల తీర్పు
- నిర్వాసితులు, రాజకీయ నాయకులకు సన్మానం
- నిర్వాసితుల పక్షాన పోరాడినం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



నిర్వాసితులు, సీపీఐ(ఎం) నాయకులను సన్మానిస్తున్న మల్లారెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

మల్లన్న సాగర్ ప్రాజెక్టు కింద సర్వం కోల్పోయిన నిర్వాసితుల పోరాటంలో నమోదైన కేసులు కొట్టివేయబడ్డాయి. నిర్వాసిత రైతులు, సీపీఐ(ఎం), ఇతర రాజకీయ పార్టీల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను సిద్దిపేట కోర్టు న్యాయమూర్తి సోమవారం కొట్టి వేశారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలంలో 2016లో అప్పటికే పోరాటం చేస్తున్న నిర్వాసితులపైన, వారికి మద్దతు తెలిపిన సీపీఐ(ఎం) పార్టీ, ఇతర రాజకీయ పార్టీల నాయకులపైన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. కేసులు పెట్టిన నిర్వాసితులు, నాయకుల్ని జైలుకు పంపారు. ఆ కేసుల విచారణ నిమిత్తం 8 ఏండ్లుగా సిద్దిపేట జిల్లా కోర్టు చుట్టు తిరగాల్సి వచ్చింది. సోమవారం సిద్దిపేట జిల్లా కోర్టులో కేసులను కొట్టివేశారని బాధితులు తెలిపారు. న్యాయ పోరాటంలో విజయం సాధించిన నిర్వాసితులకు, సీపీఐ(ఎం) నాయకులకు సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న సాగర్ కొరకు 14 గ్రామాల ప్రజల నుంచి అక్రమంగా భూసేకరణకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. దానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పార్టీ ముందు నిలిచి ప్రజలను చైతన్యం చేస్తూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిందన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న నిర్వాసితులకు అండగా నిలబడ్డ సీపీఐ(ఎం) పార్టీతో పాటు, ఇతర రాజకీయ పార్టీ నాయకులపైన అప్పటి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులు బనాయించిందని విమర్శించారు. పోలీసులచే నిర్వాసితులను, వారికి మద్దతు తెలిపిన రాజకీయ పార్టీ నాయకులపైన లాఠీ చార్జీలు చేసి, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులు సంవత్సరాల తరబడి తమకు న్యాయం చేయాలని పోరాడుతుంటే, వారికి సరైన న్యాయం చేయకుండా, సరైన నష్టపరిహారం అందించకుండా ఈ రోజు వరకు నిర్వాసితులను ప్రభుత్వం మోసం చేస్తుందని విమర్శించారు. మల్లన్న సాగర్ పోరాటం దేశంలోనే ఒక గుర్తింపు తెచ్చిందని గుర్తు చేశారు. ఈ పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు సాధించుకున్న నిర్వాసితులకు మాత్రం సంపూర్ణ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చేతివాటం, ప్రభుత్వం వారికి అండదండలు ఉండడం నిర్వాసితులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన నిర్వాసితులకు, ఇతర రాజకీయ పార్టీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. న్యాయం ముందు ప్రభుత్వం ఓడిపోయిందని, నిర్వాసితులు మాత్రమే గెలిచారని ఈ రోజు కోర్టు ఇచ్చిన తీర్పు అందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మల్లన్న సాగర్ నిర్వాసితులకు రావలసిన న్యాయమైన నష్ట పరిహారాలను వెంటనే మంజూరు చేసి, నిర్వాసితులందరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ పోరాటంలో సహకరించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, కోర్టులో వాదించిన న్యాయవాది రాజలింగం, వారి బందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు ప్రతాప్ రెడ్డి, సీపీఐ(ఎం) పార్టీ సంగారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శులు జి.జయరాజు, ఏ.మల్లేశం, సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్, నిర్వాసితులు శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, రాజనర్సింహారెడ్డి, హయతుద్దీన్, నరసింహారెడ్డి, కరుణాకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, స్వామి, శ్రీకాంత్, విజయ్, పాండు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాట ఫలితమే.. ఈ విజయం



మల్లన్నసాగర్ ముంపు బాధితుల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేశాం. అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసులను అందరం ఐక్యంగా కోర్టులో వాదనలు వినిపించడం, మావైపే న్యాయం ఉండడంతో కోర్టు కేసులను కొట్టివేసింది. ఐక్యపోరాట ఫలితంగానే విజయం సాధించాం. నిర్వాసితులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

జి. భాస్కర్,
సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠంగా తీర్పు



మల్లన్న సాగర్‌లో నిర్వాసితులు తమకు న్యాయమైన పరిహారం కావాలని పోరాడితే, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులు బనాయించి, బెదిరింపులకు పాల్పడింది. న్యాయంకోసం అందరం ఐక్యంగా పోరాటం చేసాం. పేదల పక్షాన నిలిచి లాఠీచార్జీలు తిన్నాం. అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠంగా సోమవారం కోర్టు తీర్పు వచ్చింది.

ఏ.మల్లేశం, సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి

ఇది నిర్వాసిత రైతుల విజయం



సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో 2016లో పోరాటం చేస్తున్న నిర్వాసితులపైన, వారికి మద్దతు తెలిపిన సీపీఐ(ఎం) పార్టీ ఇతర రాజకీయ పార్టీల నాయకులపైన అప్పటి రాష్ట్ర ప్రభు త్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. గత 8 ఏండ్లుగా సిద్దిపేట జిల్లా కోర్టుకు తిరుగుతున్నాం. సిద్దిపేట జిల్లా కోర్టులో అక్రమంగా పెట్టిన కేసులను సోమవారం కొట్టివేశారు. ఇది రైతుల విజయం. భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలి. న్యాయం కోసం పోరాడుతున్న నిర్వాసితులకు అండగా నిలబడ్డ సీపీఐ(ఎం) పార్టీతో పాటు ఇతర రాజకీయ పార్టీ నాయకులపైన అప్పటి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులు బనాయించింది. పోలీసులచే నిర్వాసితులను, వారికి మద్దతు తెలిపిన రాజకీయ పార్టీ నాయకులపైన లాఠీ చార్జీలు చేసి అక్రమ కేసులు పెట్టింది. పోరాటాల ఫలితంగానే నిర్వాసితులకు న్యాయం జరిగింది.

-గొల్లపల్లి జయరాజు,
సీపీఐ(ఎం) పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలి

బ్యాక్‌లాగ్ పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలి.. ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



నవతెలంగాణ-సంగారెడ్డి

వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా కమిటి సమావేశాన్ని సోమవారం కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతీ వికలాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డు మంజూరు చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ర్యాంపులు నిర్మించాలన్నారు. ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బస్వారాజు పాటిల్, తలారి గోపాల్ మాట్లాడుతూ.. జిల్లాలో వికలాంగులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కారం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సదరం క్యాంపు దగ్గర కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మున్సిపల్, జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో వికలాంగులకు ఎందుకు రిజర్వేషన్స్ అమలు చేయడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసిన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ బ్యాంకులు ఇచ్చే రుణలలో 5 శాతం వికలాంగులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు కొణింటి నర్సిములు, ప్రకాష్ రావు, జిల్లా కమిటి సభ్యులు సుధాకర్, నర్సిములు, నాయక్, రాంచంధర్, బాలయ్య, నాగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాడు ఆత్మహత్యలకు పురిగొల్పి.. నేడు సంఘీభావాలా?



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆర్టీసీ కార్మికులను నాడు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మహత్యలకు పురిగొల్పి.. ప్రస్తుతం ఆటో కార్మికులకు మాజీ మంత్రి హరీశ్‌రావు సంఘీభావం తెలుపడం సిగ్గుచేటని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆటో స్టాండ్ వద్ద ఆటో కార్మికులతో సోమవారం మాట్లాడుతూ.. ప్రజా నాయకుడు రేవంత్‌రెడ్డి.. రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తావని ఎన్నికల్లో మాట ఇచ్చారని.. అదే ప్రక్రియలో ప్రభుత్వం ఉన్నదన్నారు. గత నెలలో రవాణా రంగంలో ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.5 లక్షలు వచ్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం సమ్మె చేస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం అణిచివేసిందని.. అప్పటి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారన్నారు. అంతేకాకుండా ప్రగతి భవనం ముట్టడిలో తామందరం కలిసి పాల్గొన్నామని.. అరెస్టులు కూడా అయినట్టు గుర్తు చేశారు. 45 మంది ఆర్టీసీ కార్మికులు నాడు ఆత్మహత్యలు చేసుకున్నారని, అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం వారి పట్ల ఎటువంటి సానుభూతి చూపలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తెలంగాణ మహిళ సమాజం పూర్తిగా కాంగ్రెస్ వైపు మద్దతుగా నిలవడంతో.. మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక జిల్లా ఎమ్మెల్యేలు ఆటో కార్మికులను రెచ్చగొడుతున్నరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు త్వరలోనే ఏర్పాటు అవుతోందని.. రవాణా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సాంబయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి కాంగ్రెస్ నాయకులు యువరాజ్ మోరే, ఆసిఫ్, అబ్దుల్ అహమ్మద్, పాష, రాజు, సంతోష్, ఆటో యూనియన్ నాయకులు మధు, జాంగిర్ నాయక్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

5జీ టెక్నాలజీపై గీతమ్‌లో అధ్యాపక వికాస కార్యక్రమం

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో '5జీ టెక్నాలజీ, ఆపైన పురోగతి' అనే అంశంపై ఈనెల 8-9 తేదీలలో అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్ఎపీ) నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.5జీ టెక్నాలజీలో తాజా పరిణామాలు, అధునాతన కమ్యూనికేషన్ టెక్నాలజీ పరిశోధనకు అవకాశాలను తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీ రంగంలో తమ సరిశోధనా సామర్థ్యాలను పెంచుకోవడానికి అధ్యాపకులు, సీహెచ్ఎ రీసెర్చ్ స్కాలర్లు, పీజీ విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. తమ పరిశోధనా ప్రాంతాలలో 5జీ /6జీ సాంకేతికతను వర్తింపజేయడానికి, 5జీ / 6 జీకి మించిన రోడ్- మ్యాప్ లోతైన అవగాహన పొందేందుకు ఇందులో పాల్గొనే వారికి అవకాశం ఉంటుందని డాక్టర్ మాధవి వివరిం చారు. ఈ ఉచిత ఎఫ్‌పీలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈనెల 7వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, 50 మంది మాత్రమే అవకాశం ఉంటుందని, ముందు వచ్చిన వారి తొలి ప్రాధాన్యం పద్ధతిలో అవకాశం కల్పిస్తామన్నారు. అవసరమైన వారికి నామమాత్రపు ధరకే గీతం హాస్టళ్లలో వసతి కల్పిస్తామని, అయితే ఆ విషయాన్ని నిర్వాహకులకు ముందుగా తెలియజేయాలని ఆమె స్పష్టీకరించారు.మరింత సమాచారం కోసం ఎఫ్ఎపీ సమన్వయకర్త ఎం.రఘుపతి (9441544079)ని సంప్రదించాలని, లేదా rmangala@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు.. డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

మధ్యాహ్న భోజన కార్మికులకు 5 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సాయిలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి ప్రతీరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. కానీ ఆ కార్మికులకు మాత్రం ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 5 నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని వాపోయారు. ప్రభుత్వం అందించే రూ.3000 కూడా ఐదు నెలల నుంచి అందించకుంటే.. వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వారికి రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారంలో రెండుసార్లు గుడ్లు పెట్టాలని అధికారులు చెబుతున్నా.. ప్రభుత్వం మాత్రం ఐదు రూపాయలే చెల్లిస్తున్నదన్నారు. కానీ బయట దుకాణాల్లో ఏడు రూపాయలకు గుడ్డు దొరుకుతుందని.. కాబట్టి గుడ్డు రేటు పెంచాలన్నారు. వారికి గ్యాస్ సబ్సిడీ అందజేయాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వంట షెడ్డు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకు డీఈవో సూపరింటెండెంట్ స్పందిస్తూ.. బకాయి బిల్లులు వారం రోజుల్లో చెల్లిస్తామని, ఇతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, లక్ష్మి, శంకరమ్మ, స్వరూప, చెందమ్మా, సాయమ్మ కార్మికులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన టీఎస్‌యూటీఎస్ సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడు తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని చిన్నచూపు చూడడం మానవ వనరులను తగ్గించడమే అవుతుంద న్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసిన ఫలితంగా ఉపాధ్యాయుల కొన్ని సౌక ర్యా లు కల్పించబడ్డాయన్నారు. నూతన ప్రభుత్వం పై ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ వర్గాలు ఎంతో ఆశతో ఉన్నాయని దానిని వమ్ము చేయకుండా వెంటనే జోన్2లో నిలిచిపోయిన పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియ పూర్తి చేయ వాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపా ధ్యాయులకు న్యాయం చేయాలని,పెండింగ్ ఆర్థికప రమైన బిల్లులను క్లియర్ చేయవాలని, పిఆర్సి కమిటీ రిపోర్టు తొందరగా తెప్పించి అమలు పరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్వతరెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబెర్ అలీ, ఏఐఎస్టిఎఫ్ నాయ కులు బ్రహ్మచారి, పరమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు హఫీజ్, జీవన్ రాథోడ్, ప్రతాప్‌రెడ్డి, షకీల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
మంగళవారం | 06 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ప్రజావాణిలో 75 ఫిర్యాదులు..



నవతెలంగాణ-సంగారెడ్డి

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 75 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. వచ్చిన 75 ఫిర్యాదుల్లో 25 రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, 50 ఇతర శాఖలకు సంబంధించినవని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. జాప్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నగేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం చింతా ప్రభాకర్ మద్దతు కోరిన బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్‌ని ఆయన క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బీరయ్య యాదవ్ ఆదివారం మార్యదపూర్వకంగా కలిసి.. మెదక్ ఎంపీ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి.. మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చినట్టు బీరయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



డ్రయినేజీ పనులు పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో గల 13వ బ్లాకులో సోమవారం స్థానిక కార్పొరేటర్ పుష్ప నాగేష్ పర్యటించి అక్కడ జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు ఉదాసీనంగా వ్యవహరించకుండా పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పనులు పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాగానే వాటిపైన సీసీరోడ్లు నిర్మాణ పనులు సైతం పూర్తి చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి జనార్దన్, ఇంజినీరింగ్ ఏఈ ప్రభ, నటకులు నాగులు గౌడ్, శ్రీను, అశ్విని, బిందు, మల్లేష్, మహిపాల్, అలీ బాబా, మహేష్, నర్సింహా, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివి.. లక్ష్యాలను చేరుకోవాలి



నవతెలంగాణ-జిన్నారం

విద్యార్థులు ఇష్టంగా చదివి లక్ష్యాలను సులభంగా సాధించాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోని పులిగిల్ల ప్రకాశం చారి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్ సౌజన్యంతో జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరి యల్, పరీక్ష ప్యాడ్లు పెన్నులను అందజేస్తూ మోటివేషనల్ క్లాసుల నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి జీవితంలో 10వ తరగతి పరీక్షలు ప్రధానమైనవని విషయపరమైన అవగాహనతో, సృజనాత్మకతతో లక్ష్యాలను సునాయాసంగా సాధించాలన్నారు. ఒత్తిడికి దూరంగా ఉండాలని, ఫోన్లు సోషల్ మీడియా తదితరాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

కాగా మానసిక వ్యక్తిత్వ నిపుణులు డాక్టర్ సతీష్‌తో మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ పూర్ణ కృష్ణ, సోను, ప్రసన్న కుమార్, ఎంఈఓ రాథోడ్‌లు ఒత్తిడికి గురికాకుండా ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేష్ గౌడ్, జిన్నారం మండల సీనియర్ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఎంఈఓ జెమినీ కుమారి, సర్పంచులు సత్యం నారాయణ ఆంజనేయులు సీనియర్ నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, బాసెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ సాధారణ సమావేశం

- నిధుల కేటాయింపులో మొండిచేయి చూపారని కౌన్సిలర్ల ఆందోళన
- సమావేశం నుంచి వాకౌట్..



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మార్చి-2024 నుంచి డిసెంబర్ 2024 వరకు సాధారణ నిధులను 32 ప్రతిపాదనలతో ఆరు కోట్ల ముప్పై లక్షల రూపాయలతో ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్‌కు చెందిన 16వ వార్డు కౌన్సిలర్ చంద్రారెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ నిహారిక వరప్రసాద్ రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య,1వ వార్డు కౌన్సిలర్ చంద్రయ్య, జయమ్మ రమణయ్య, కాంగ్రెస్ పార్టీ15వ వార్డు కౌన్సిలర్ పుల్లగూర్ల సంతోష లక్ష్మారెడ్డి తమ వార్డుల్లో నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వారు సమావేశ మందిరం బయటకు వచ్చి చైర్మెన్, కమీషనర్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మెన్ అవినీతికి పాల్పడుతున్నారని, తమ వార్డులలో నిధులు కేటాయించలేదని తమను గెలిపించిన ప్రజలకు ఏమని సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం వారు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ సాధారణ సమావేశంలో వైస్ చైర్మెన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



బొల్లారంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఎస్ఎల్‌జి హాస్పిటల్, ఎల్-బేతల్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్ఎల్‌జి హాస్పిటల్ అగ్రశ్రేణి వైద్యులు ఈ శిబిరంలో చికిత్సలు అందించారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, బీపీ చెకింగ్,ఇసిజి, డయాబెటిక్ చెకప్, 2-డి ఎకో తదితర వ్యాధులకు 250 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ చంద్రయ్య, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్సై సుభాష్, తహశీల్దార్ సంధ్య, ఎంపీపీ వావిలాల నర్సింలు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాలలో ముందుంటూ.. బడుగు బలహీన అభ్యున్నతి కోసం కేవీపీఎస్ ఎంతగానో కృషి చేస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హత్నూర మండల నాయకులు కొనంపేట శేఖర్, వివిధ సంఘల నాయకులు, ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా నాయకులు, కర్రే నాగేష్, తెలంగాణ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి నర్సాపూర్ అధ్యక్షులు మీనపల్లి శ్రీశైలం, దౌలపురం నర్సింలు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పరిశ్రమల్లో సమ్మె పత్రాలు అందజేత
- సమ్మె పోస్టర్ల ఆవిష్కరణలు, యూనియన్లతో చర్చలు







నవతెలంగాణ-గుమ్మడిదల, నారాయణఖేడ్‌రూరల్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో ఉన్న హెటీరో, ధనలక్ష్మి, జీఎస్‌బీ, సుందరం, క్లారియంట్, గ్రాన్యూల్స్, సాంపిస్టిన్, వీర్కో, తదితర పరిశ్రమల యాజమాన్యాలకు సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షుడు కే.రాజయ్య పలువురు కార్మిక సంఘాల నాయ కులతో కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. బొంతపల్లి గ్రామంలో కార్మికుల ఇంటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలో సీఐటీయూ ఉపాధ్యక్షులు రాజయ్య. నారాయణఖేడ్‌లో ఆటో డ్రైవర్లు, భవని ర్మాణ కార్మికుల అడ్డాల వద్ద సమావేశాల వద్ద సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చే స్తూ.. పేదల కడుపు కొడుతున్నదని మండిపడ్డారు. ఏడా దికి రెండు కోట్ల ఉద్యోగాలు, ధరల తగ్గింపు, విదేశాల్లో దాచి పెట్టిన డబ్బును తెచ్చి పేద ప్రజల అకౌంట్లో రూ.15 లక్షలు జమ చేస్తామన్న ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయ త్నం చేస్తున్న దన్నారు. మోడీ ప్రభుత్వ అవలంభిస్తున్న ఇలాం టి ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో గుమ్మ డిద లలో శ్రీధర్ రావు, హుస్సేన్, రవి, సురేందర్ రెడ్డి, కార్మి కు లు, ఖేడ్‌లో భవన నిర్మాణ కార్మికు సంఘం నాయకులు సాల్మన్, రాజు, లక్ష్మణ్, కంట్యాప్ప, రుద్రారం ఆటో యూనియన్ నాయకులు మాణిక్యం, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు : దేశవ్యాప్త సమ్మెను సందర్భంగా పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల మండలాల పీహెచ్‌సీల హెల్త్ ఆఫీసర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా సంఘాలు కలిపి దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఆశా వర్కర్లకు ప్రస్తుతం 9వేల పారితోషకం వస్తుందని, గత డిసెంబర్, జనవరికి సంబంధించి 2నెలల వేతనాలు నేటికీ చెల్లించలేదని ఆరోపించారు. గత 18 ఏండ్లుగా పని చేస్తున్నా.. ఫిక్స్‌డ్ వేతనం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తసుకోకపోవడం దారుణమ న్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టాలని, అందుకు ఈనెల 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు వైష్ణవి, పద్మ, హైమవతి, వీరమని, అరుణ, నాగమణి, పుణ్యమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త కార్మికుల సమ్మె పోస్టర్‌ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఐబిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ఆ విధానాలను వ్యతిరేకిస్తూ 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు, సహాయ కార్యదర్శిలు వెంకటరాజ్యం, శివశంకర్, బి.లక్ష్మి, శంకరప్ప, సీపీఐ సీనియర్ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట, మునిపల్లి : సదాశివపేటలో ఐకేపీ, వీవోఏ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎం నరసింహులుకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా సదాశివపేటలో అలాగే మునిపల్లిలో ఆశా కార్మికులతో ప్రవీణ్‌కుమార్ వేర్వేరుగా మాట్లాడుతూ.. ఐకేపీ, వీవోఏ కార్మికులు అనేక ఏండ్ల నుంచి చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు.. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలపై 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సదాశివపేటలో ఐకేపీ, వీవోఏ యూనియన్ నాయకులు నాగరాజ్, ఆంజనేయులు, మొయిజ్, రోషనలి, యాదయ్య, సత్యమ్మ, మంగ, జ్యోతి, మునిపల్లిలో సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సంగీత, లలిత, పావని, పుష్పలత, మంజుల, విజయలక్ష్మి, సునీత, అనిత, జ్యోతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓకు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసిడిఎస్ రక్షణకు నిధులు కేటాయించకపోవడం చాలా దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని యెడల ఈనెల 16న గల సమ్మెలో పాల్గొని కేంద్రం మోడీ మెడలు వంచుతామన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఇందిరమ్మ, సేకమ్మ తదితరులు పాల్గొన్నారు.











బీరయ్య యాదవ్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి

నవతెలంగాణ-హత్నూర

తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బీరయ్య యాదవ్‌కు మెదక్ బీఆర్ఎస్ ఎంపీ సీట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం హత్నూర మండలాధ్యక్షులు శ్రీశైలం యాదవ్ కోరారు. మండలంలోని దౌల్తాబాద్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పనిచేసిన బీరయ్య యాదవ్.. ఉద్యమ కాలం నుంచి ఎలాంటి పదవి ఆశించకుండా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా ఉద్యమంలో ముందుండి పాల్గొన్న బీరయ్య యాదవ్ కు మెదక్ ఎంపీ టికెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి రాజు, లింగం తదితరులు పాల్గొన్నారు.



పదవికే విరమణ.. ప్రజా సేవకు కాదు

నవతెలంగాణ-జిన్నారం

పదవికే విరమణ.. ప్రజాసేవకు కాదని జంగంపేట జంగంపేట సర్పంచ్ జోగు వెంకటయ్య అన్నారు. మండలంలోని జంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య పాలకవర్గాన్ని సోమవారం ఘనంగా సన్మానించారు. ఐదేండ్లపాటు అభివృద్ధిలో సహకారం అందించిన గ్రామ ప్రజలకు, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్‌కు పంచాయతీ పాలకవర్గం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశంగౌడ్,ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి,వార్డు సభ్యులు నర్సారెడ్డి, మంజులాదుర్గేష్ యాదవ్, దీపా మల్లారెడ్డి, స్వాతిశేఖర్, లావణ్యనర్సింలు, వావిలాల పిఎసిఎస్ చైర్మన్ శంకర్ రెడ్డి, జిన్నారం నీటి సంఘం మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీ రత్నమని, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వకుంటే నీళ్లు బంద్ చేస్తాం



నవతెలంగాణ-సంగారెడ్డి


వాటర్ సప్లయ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని.. లేని పక్షంలో నీళ్లు బంద్ చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాల్టీలో గత 3 నెలలుగా వాటర్ సప్లయ్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోజుకు 5 నుంచి 6 లక్షల రూపాయలు బిల్లులు వసూలు చేస్తున్నా.. కార్మికులకు మాత్రం వేతనాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరించి.. నీళ్ల బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, రాజు సంగమేశ్వర, జనార్దన్ శ్రీనివాస్,శ్రీశైలం, మల్లేశం శ్రీనాథ్, దశరథ్, ములు జనార్ధన్, జేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. దివ్య ఖురాన్ పఠించిన మున్సిపాల్టీ కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల కళాశాల విద్యార్థులకు మైనార్టీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్య ఖురాన్ పఠించిన విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శంకర్ సెట్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాహిర్ అలీ, మైనొద్దీన్, సుబ్బుర్, మొయి న్, అబ్దుల్లా రషీద్,యూసఫ్,హెడ్‌మాస్టర్ ఖాదర్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.





ఖేడ్ నుంచి పండరీపూర్‌కు పాదయాత్ర

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని రామ్‌మందిర్ నుంచి మహారాష్ట్రలో పుణ్యక్షేత్రమైన పండరిపూర్ దిండి వరకు కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, అవధూత్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను డీసీసీ కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ పాదయాత్ర విజయవంతం కావాలని.. ప్రజలకు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, డీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, సుధాకర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, అశోక్ రావు, పండరెడ్డి, సంజీవ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మూసివేసిన సీసీఐ (పత్తి) కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన నారాయణఖేడ్ ఏరియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పత్తి పంట సాగు అవుతున్న దన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,55,802 ఎకరాల్లో సుమారు 3,55,802 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతున్నదన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సీసీఐ 1,10,674 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసిందని.. ప్రయివేటు వ్యాపారులు 20,816 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయ న్నారు. ఇంకా 2 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉన్నదన్నారు. సీసీఐ పత్తి కొనకపోవడంతో ప్రయివేటు వ్యా పారులు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తు న్నారన్నారు. సీసీఐ రూ.7020కి పత్తిని కొనుగోలు చేస్తుంటే.. వ్యాపారులు మాత్రం రూ.5వేల నుంచి రూ.6500కు క్వింటాల్ చొప్పున కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్నా, నిర్లక్ష్యంగా ఉన్న అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రాలను తెరిపెంచాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు నర్సింలు కాన్సిరాం సంతోష్, మోషప్ప, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీసు కళా బృందం

నవతెలంగాణ-నార్సింగి





మండల పరిధిలోని శేరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు మేలు కొలువు కళా బృందం వారు సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, లవ్ ఎఫైర్స్, ఏ.హెచ్.టీ.యూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విలువ అనే అంశాలపై అవగాహన కల్పించారు. విలువైన సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ టీ. సురేందర్, హెూంగార్డ్ లు జనార్ధన్, ఎస్. ఇసాక్, టీ. విఠల్, నార్సింగి ఎస్సై అహ్మద్ మోహిఉద్దీన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు వీ. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

3

మెదక్

మంగళవారం | 06 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ప్రజావాణికి 98 అర్జీలు

నవతెలంగాణ-మెదక్





ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 98 అర్జీలు రావడం జరిగింది. ఇందులో భూ సమస్యలపై 52, పించన్ కోసం 13, ఉపాధి కోసం 08, ఇతర సమస్యలపై 25 అర్జీలు ఉన్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాలానే ఉద్దేశ్యంతో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ సమస్యలపై స్వీకరించిన పిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, డిఆర్ఓ పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

- ఈవీఎంల ఎఫ్ఎల్‌సి ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-మెదక్

ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించి పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ సీల్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమికంగా పరిశీలన (ఎఫ్.ఎల్.సి) జరిపేందుకు ఈసీఐఎల్‌కు చెందిన 7 మంది సాంకేతిక నిపుణుల బృందం జిల్లాకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ బృందం పది రోజుల పాటు ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. స్థానికంగా గల 1197 బ్యాలెట్ యూనిట్లు, 947 కంట్రోల్ యూనిట్లు, 911 వీవీ ప్యాట్‌లను నిపుణుల బృందం పరిశీలిస్తుందని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.





రేషన్ బియ్యం పట్టివేత

- 22 టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-మనోహరాబాద్



అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను సీజ్ చేసినట్టు తూప్రాన్ పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కాటేదాన్‌కు చెందిన సలీం అక్రమంగా 22 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేశారన్నారు. కాగా తూప్రాన్ శివారులోని టోల్ ప్లాజా వద్ద సీవిల్ సప్లై డిటి సాధిఖ్‌తో కలిసి ఎస్ఐ శివానందం తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్టు తెలిపారు. 22 టన్నుల పీడీఎస్ బియ్యంతో పాటు లారీని సీజ్ చేసి పోలీస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివానందం తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

- మోగి పురుగు నివారణ సూచనలు

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పలు గ్రామాలలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో మోగి పురుగు ఎక్కువగా ఆశిస్తోందని, నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే ఈనిన తరువాత తెల్లకంకులు బయటకు వస్తాయన్నారు. ఆలస్యంగా లేకా ముదురు నారు నాటడం, కరువు పరిస్థితులు, తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు ఉండి, సూర్యరశ్మి రోజుకు 7 గంటలు కంటే ఎక్కువ, నత్రజని తక్కువగా వాడటం వలన కాండం బలహీనం కావడం ఈ పురుగు ఆశించడానికి అనుకూలంగా మారుతుందన్నారు. యాసంగి వరి పైరులో ఎక్కువగా ఆశిస్తుందన్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు వర్ధన్, రజినీకాంత్, రైతులు తదితరులున్నారు.

ర్యాంకులు సాధిస్తున్న ప్రగతి విద్యాసంస్థలు

- స్మార్ట్ ఫోన్‌లకు విద్యార్థులు దూరం


నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో ర్యాంకులు సాధిస్తున్న ప్రగతి విద్యాసంస్థ విద్యార్థులను ఆకట్టుకుంటుంది. పదో తరగతి విద్యార్థులను స్మార్ట్‌ఫోన్‌లకు దూరం పెట్టడంతో విద్యాభ్యాసంపై విద్యార్థులు ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రగతి విద్యాసంస్థల్లో 2001లో ప్రగతి జూనియర్ ఒకేషనల్ కళాశాలలో ఏర్పాటు చేశారు. మంజీరా కాన్ఫరెన్స్ స్కూల్ 2003లో ఏర్పాటు చేయగా, ప్రగతి స్కూల్ 2007లో ఏర్పాటు చేశారు. విద్యాసంస్థలు విద్యార్థులు తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి కృషి చేస్తున్నాయి. గజ్వేల్ తాలూకా పరిధిలో ప్రగతి విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ర్యాంకులు సాధిస్తున్నారు. పాఠశాల యజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులను మెరుగుపరుస్తుంది. మంజీరా కాన్ఫరెన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ఏటా మంచి మార్కులు తెచ్చుకుని పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులపై పాఠశాల యజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉదయం, సాయంత్రం విద్యార్థుల పనితీరును, చదువును వారు పరిశీలిస్తున్నారు. విద్యాసంస్థల చైర్మన్ అంబదాస్ ర్యాంకులు సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఉపాధ్యాయుల ద్వారా చర్చిస్తున్నారు. మంజీరా కాన్ఫరెన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ప్రగతి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తూ సక్సెస్ అవుతున్నారు. మంజీరా కాన్ఫరెన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు 27 మంది ఉండగా ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రగతి పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉండగా ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ఏటా 100% విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారు. రెండు పాఠశాలలో సైతం విశాలంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ఫోన్లు అనుమతి లేవు. పదో తరగతి విద్యార్థులకు రివిజన్ టెస్ట్, గ్రాండ్ టెస్టులు, ప్రీ ఫైనల్ టెస్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడుతూ ఇంటి వద్ద ఫోన్లు విద్యార్థులకు ఇవ్వొద్దని పరీక్షల సమయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్త తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. అదేవిధంగా ప్రగతి ఒకేషనల్ కళాశాలలో విద్య విద్యార్థిని విద్యార్థులకు ప్రస్తుతం ప్రాక్టికల్స్ కొనసాగుతున్నాయి. ఫస్ట్ ఇయర్ 320, సెకండ్ ఇయర్ 400 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకేషనల్ కోర్సులు ఆరు వరకు ఉన్నాయి. జూనియర్ కళాశాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి 100% మార్పు సాధించేలా విద్యార్థులు మెరుగుపరుస్తున్నారు. ఒకేషనల్ కళాశాలలో 20 మంది అధ్యాపకులు ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాము. ప్రతి సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత వస్తుంది. ఈసారి కూడా రెండు పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి విద్యాభ్యాసం ఏ స్థాయిలో ఉందని పరిశీలిస్తున్నాం. మెరుగుపరిచేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఫోన్లో తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించి స్మార్ట్ ఫోన్లు దూరం ఉంచాలని ప్రయత్నిస్తున్నాం. విద్యార్థులకు పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. విశాలమైన గదులు ఉండడంతో విద్యాభ్యాసం విద్యార్థికి అర్థం అయ్యేలా చూస్తున్నాం. ఉపాధ్యాయుల సకాలంలో పాఠశాలలకు చేరుకొని విద్యాబోధన అందిస్తున్నారు.



ప్రిన్సిపాల్ అంబదాస్

ఖమ్మం టిపిటిఎస్ మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్: ఖమ్మంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుంచు నరేందర్ కోరారు. సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకు ఈ సభలలో మహిళల స్థితిగతులు-కర్తవ్యాలు అనే అంశంపై చందనా చక్రవర్తి అనే రచయిత్రి ప్రసంగిస్తారని, మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అంతరాలు లేని విద్యావిధానం, విద్యలో ఏకరూపత సాధించే దిశగా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, ఇందులో ప్రొఫెసర్లు, తెలంగాణ రాష్ట్ర మంత్రి, విద్యావంతులు పాల్గొననున్నారని, ఉపాధ్యాయులు విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, జిల్లా కౌన్సిలర్ మోహన్ రావు, మహిళా ఉపాధ్యాయులు ప్రదీప రాణి, మయూరి, అరుంధతి, ప్రేమలత, ఫౌజియా, వెంకట లక్ష్మి ఉపాధ్యాయులు, మల్లేశం, అర్జున్, నర్సింగ రావు, పాల్గొన్నారు.

శిలా ఫలకాలు వేశారు, నిర్మాణం మరిచారు

నవతెలంగాణ-నార్సింగి

ప్రజా తీర్పుతో ప్రభుత్వాలు మారడం సహజం. అదే విధంగా పాత ప్రభుత్వాలు మొదలు పెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. సరిగ్గా ఇలాగే నార్సింగి మండలంలో కూడా జరుగుతుంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ హయాం లో మండల కేంద్రంలో అప్పటి ఎమ్మెల్యే కీ.శే. చెరుకు ముత్యం రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఐకేపీ భవనం నిర్మాణం కొరకు శంకుస్థాపన చేస్తూ శిలాఫలకం వేశారు. శంకుస్థాపన జరిగి తొమ్మిది సం. కావస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణం జరగక శిలాఫలకం మాత్రమే దర్శనమిస్తుంది. ఐకేపీ భవనం అవసరం ఉన్నందున నిర్మాణం చేయాలని భావించినా, ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం జరగ లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం శిలాఫలకం వేయడం మాత్రమే జరిగి, నిర్మాణం ఆగిపోయింది. అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భాగంగా నిర్మాణం తలపెట్టి శిలాఫలకం వేసి ఈ నెల పదవ తేదీన పదకొండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నాయి. ఈ విషయాలపై మండల బీజేపీ నాయకుడు కుమ్మరి నరసింహులు మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ హయాంలో



నిర్మించతలపెట్టిన పనులను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అది ప్రజల ప్రాథమిక హక్కన్నారు. స్వర్గీయ చెరుకు ముత్యం రెడ్డి హయాంలో వేసిన శిలా ఫలకాలను, అభివృద్ధి పనులకు ఇప్పుడైనా శ్రీకారం చుట్టి, ప్రతి పనిని ప్రారంభించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల ఆనందం

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును పథకం పట్ల లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలలో ఉచిత విద్యుత్తు ఒకటి అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం మంత్రివర్గ సమావేశంలో అమలు చేస్తామని మంత్రివర్గం ఆమోదించడంతో నిజాంపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల విద్యుత్ ఏఈ గణేష్‌ను వివరణ కోరగా, మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలోనికి వచ్చే గ్రామాల విద్యుత్ వినియోగదారులు"బచ్చు రాజు పల్లి" గ్రామంలో కేటగిరి 1 అనగా ఇండ్లలో వినియోగించే విద్యుత్తు లబ్దిదారులు 281 మంది ఉన్నారన్నారు. చల్మెడలో 967 మంది లబ్దిదారులు, డి ధర్మారంలో 957మంది, కల్వకుంటలో 871మంది, నస్కల్‌లో 683 మంది, నిజాంపేటలో 1395 మంది, నందిగామలో 497 మంది, నార్లాపూర్‌లో 657మంది, రైలాపూర్ 496, శివాయిపల్లి 162, రజాక్ పల్లి 143, రాంపూర్ 284, నంద గోకుల్ 288, వెంకటాపూర్ కె 390, కాసింపూర్ 57, నగరం 156, కాసిం పూర్ తాండ 29, షౌకత్ పల్లి 75, తిప్పనగుల్ల 238, జడ్చర్ తాండ 101 మంది లబ్ది పొందనున్నారని తెలిపారు. మొత్తం నిజాంపేట సబ్‌స్టేషన్ పరిధిలో 8727 లబ్దిదారులు ఉచితంగా విద్యుత్తును వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉచిత విద్యుత్తు అందించడం సంతోషం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం. మాలాంటి పేద మధ్యతరగతి కుటుంబాల ఇండ్లకు 200 యూనిట్ల విద్యుత్తు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వాలు చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందించడం సంతోషకరం. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయంతో మండలంలోని ఉచిత విద్యుత్ వినియోగదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మలావత్ మంగ్య, జెడి చెరువు తండా

ప్రవక్త చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలి

నవతెలంగాణ-నిజాంపేట:

ప్రవక్త ఇచ్చిన శాంతి సందేశాలు సమాజంలో ఉండటానికి ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ముఫ్తీ షహీద్ అక్బర్ సబ్ అన్నారు. మండల కేంద్రంలోని దారుల్ ఉలుమ్ అలీమియ స్థాపకుడు అన్వర్ సహబ్ ఆధ్వర్యంలో సోమవారం మస్జిద్ దగ్గర ముస్లిం సోదరులతో సమావేశం నిర్వహించారు. ముందుగా మజ్లీస్ తహఫుజ్ ఖత్మే నభువత్ ఆధ్వర్యంలో శాంతి సందేశం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మం చూపే శాంతి సౌభ్రాతృత్వాలపై సందేశాన్ని ఇచ్చారు. భిన్నత్వంలో ఏకత్వంపై మొహమ్మద్ ప్రవక్త ఇచ్చిన శాంతి సందేశాలను సమాజంలో ఉండటానికి ఆయన చూపిన మార్గంలో ఏలా నడవాలి, ఎలా ఉండాలి అనే అంశాలపై సందేశాన్ని తెలియపర్చడం జరిగిందన్నారు. అదేవిధంగా 1992 సంవత్సరంలో చిన్నగా ప్రారంభమైన మదర్సా నేడు కాలక్రమేనా అనేక విధాలుగా అభివృద్ధి చెంది ఎంతో మంది ముస్లిం విద్యార్థిని విద్యార్థులకు ఖురాన్ పఠనం చేస్తున్నారన్నారు.



అదేవిధంగా తెలుగు, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రాలు బోధిస్తూ వారిని ఉన్నత స్థానానికి ఎదిగేలా కృషి చేశామని తెలిపారు. అలాగే ఇక్కడ చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ముస్లిం మత పెద్దలు ముఫ్తి అబూబకర్ జాబీర్ ఖాసీం సాబ్, ముస్లిం మైనార్టీలు అబ్దుల్ అజీజ్, హఫీజ్ ఫాహిమొద్దీన్, హఫీజ్ ముజహిద్, హఫీజ్ షర్ఫుద్దీన్, మౌలానా అహమ్మద్, అబ్దుల్ వాజీద్, మహమ్మద్ తల్హా ముస్లిం మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష నైపుణ్యతపై ప్రతిభ పోటీలు



నవతెలంగాణ-కొండపాక

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ కొండపాక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొండపాక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రామా స్పెల్ విజార్డ్ పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల అనంతరం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల నోడల్ ఆఫీసర్ విఠల్, టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి టి యాదగిరి, తపస్ జిల్లా అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్రబాబు, టిపిటిఎఫ్ జిల్లా నాయకులు రామస్వామి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు టీ.సతీష్, ఎల్టా జిల్లా ఉపాధ్యక్షులు కే కిరణ్మయి, మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మయూరిలు హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డ్రామా పోటీల్లో మొదటి స్థానంలో దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. కేజీబీవీ పాఠశాల విభాగంలో కొండపాక కేజీబీవీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ నెల 13వ తేదీన జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండలములోని ఆంగ్ల ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రగీతం ప్రకటనపై హర్షం

"జయ జయహే తెలంగాణ"
రాష్ట్ర గీతం : కె శ్రీనివాసాచారి,
అధ్యక్షుడు, తూప్రాన్ పరిరక్షణ సమితి,
ఫోన్ నెంబర్: 7780664115.



నిరక్షరాష్యుడు అందెశ్రీ ఆసువుగా ఆలపించిన "జయ జయహే తెలంగాణ..., జననీ జయకేతనం...!" అంటూ సాగిన ఉద్యమ పాట నేడు రాష్ట్ర గీతంగా తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ ప్రకటించడం హర్షనీయం. దశాబ్దాల తెలంగాణ రాష్ట్రం ఆంధ్ర నాయకుల చేతుల్లో నుంచి బంద విముక్తం చేసే ప్రయత్నంలో, తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర గీతంగా ప్రజలందరి మదిలో నిలిచిపోయిన గీతాన్ని గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, క్యాబినెట్ "రాష్ట్ర గీతం" హెూదాను ఇవ్వడం సముచితం. ఆంధ్ర పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని చెరబడితే - రాష్ట్ర గీతాన్ని కేసీఆర్ ఈ పదేళ్లపాటు చీకటిలో ఉంచాడు. రేవంత్ రెడ్డి అన్నట్లు "కెసిఆర్ తెలంగాణకు దశాబ్ద కాలం పాటు చేసిన ద్రోహం ఆంధ్ర పాలకులు కూడా చేయలేదు". ఏది చేసినా తనకు, తన కుటుంబానికి, తన వర్గానికి మాత్రమే లాభం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవడంలో కేసీఆర్ దిట్ట. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడంలో తనకు ఎంత మాత్రం ప్రయోజనం లేదు, లాభం లేదు... కనుకనే కేసీఆర్ ఆ నిర్ణయం తీసుకోలేకపోయారు. ఏదేమైనా ఎట్టకేలకు అందెశ్రీ మానస పుత్రిక రాష్ట్ర గీతంగా ఘనతికెక్కడం చారిత్రాత్మకం. ఉద్యమ పాటను గౌరవించడం అంటే తెలంగాణ ప్రజలు తమను తామే గౌరవించుకోవడంగా చెప్పవచ్చు. అదే ఆత్మగౌరవం. ఈ సందర్భంగా తాను రచయిత, మిత్రులు అందెశ్రీకి ప్రత్యేక శుభాభినందనలు తెలుపుతున్నాను. జయహెూ అందెశ్రీ. మీరు తెలంగాణ రాష్ట్రంలో ఇక చిరంజీవులు.

నవతెలంగాణ-మనోహరాబాద్

సాహిత్య పోటీలకు యూసుఫ్ పేట వాసి

నవతెలంగాణ-పాపన్నపేట



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నమయ్య సంకీర్తనలు, సంగీత, సాహిత్య అకాడమీ పోటీల్లో మెదక్ జిల్లా తరుపున పాపన్నపేట మండలం యూసుఫ్ పెట్ గ్రామానికి చెందిన ఉప్పరి భువనేశ్వర్ ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 26వ తారీకు వరకు తిరుపతిలో జరిగే ఈ పోటీల్లో తాను మెదక్ జిల్లా నుంచి ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీరి తాత రామయంపేట స్వామి వివేకానంద ఆవాస విద్యాలయ ప్రముఖ్ శ్రీనివాస్ ఆచార్య ప్రోత్సాహం వల్లే తాము ఈ పోటీలకు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. వారికి భువనేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు..

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-దుబ్బాక



ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో ప్రతీ ఆషా వర్కర్ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు ఆషా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పీ.మంజుల కోరారు. సోమవారం దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్, రామక్కపేటల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్‌లకు సమ్మెకు సంబంధించిన నోటీసులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు సంయుక్త కిసాన్ మోర్చా (రైతు - వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక) 2024 ఫిబ్రవరి 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్‌లకు, ఎన్‌హెచ్ఎం బడ్జెట్‌ను పెంచాలని, ఆశాలకు కనీస వేతనం రూ.26,000 లు ఇవ్వాలని కోరుతూ ఈ జాతీయ సమ్మెతో పాటు గ్రామీణ బంద్ లో భాగస్వాములమౌతున్నామని తెలిపారు. ధరల పెరుగుదలను అరికట్టి, ఆహార, నిత్యావసర వసువులపై జీఎస్ టీని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయు నాయకులు ఏండీ సాధీక్, ఆశా వర్కర్స్ శ్యామల, భారతీ, అనిత, లత, భాగ్యలక్ష్మీ శారద, సంతోష, చెంద్రకళ, బాబాయ్, స్వరూప తదితరులున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సబ్బండ వర్గాలకు న్యాయం



నవతెలంగాణ-మద్దూరు

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని యూత్ కాంగ్రెస్ మద్దూరు మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ అన్నారు. సోమవారం దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామ, యూత్, బిసి సెల్ కమిటీలను జనగామ డిసిసి అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, మద్దూరు జెడ్పిటిసి గిరి కొండల్ రెడ్డిల ఆదేశాల మేరకు కమిటీలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం కాంగ్రెస్ గ్రామ యూత్ బీసీ సెల్ కమిటీలను వేశారు.గ్రామ శాఖ అధ్యక్షునిగా ఇరుమల్ల అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు దేవన బోయిన పాండు, ముక్క రాజు, ప్రధాన కార్యదర్శి చేవెళ్ల మహేష్, కార్యదర్శి శ్రీకాంత్, ఎర్ర రాజేందర్, కోశాధికారి పంబాల లింగయ్య, కార్యవర్గ సభ్యులు ఎర్ర కనకయ్య, పంబాల సత్తయ్య, దేవన బోయిన బాలకృష్ణ, కూరేళ్ల చెన్నారెడ్డి, గుజ్జుక బాలయ్య, యూత్ కమిటీ అధ్యక్షునిగా ఎర్ర నవీన్, ఉపాధ్యక్షుడు మీసా శేఖర్, కార్యదర్శి గద్దల రాజు, సభ్యులు తాడెం శేఖర్, చిలువేరు శ్రీకాంత్, గద్దల రమేష్, ఎర్ర రాకేష్, దువ్వల నితిన్, బైకానీ రాకేష్, బీసీ సెల్ అధ్యక్షునిగా కొలిపాక భూపతి, ఉపాధ్యక్షులు నంగి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎలుకపల్లి యాదయ్య, కార్యవర్గ సభ్యులు చెలిమిల్లి కుమార్, పంబాల నవీన్, లింగయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ దూలం మల్లేశంలతో కమిటీలను నియమించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జెల్లా శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో శ్రీవాణి విద్యార్థులకు మొదటి బహుమతి



నవతెలంగాణ-సిద్దిపేట

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలల్లో తమ పాఠశాల విద్యార్థులు వప్రతిభను చాటారని శ్రీవాణి పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ సత్యం తెలిపారు. ఆర్. ఐశ్వర్య (10 వ), కె. కేదారినాథ్ (9వ), వి.అనన్య (8 వ)లు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. విజేతలైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనుటకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమోంటో అందించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన హెచ్‌పీసి సభ్యులు



నవతెలంగాణ -గజ్వేల్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా స్థానిక విశ్వతేజ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రయోగ పరీక్షల కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ హైపవర్ కమిటీ సభ్యులు మంగరాజు, భూపాల్ రాజు తనిఖీ చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహిస్తున్న రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నందుకు పరీక్షల డిపార్మెంటల్ అధికారిణి ఎమ్.వనజ, కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్ కె.రాజులను అభినందించారు.

హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని గెలుపొందారు. విజేతలైన విద్యార్థులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు సౌమ్య, సంజయ్,హేమ చందర్‌ను సోమవారం చేర్యాల పట్టణ కేంద్రంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతామని తెలిపారు. ఈ నెల 7 నుంచి 14 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని చితోర్ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎస్‌కె. అఖిల్, ప్రధాన కార్యదర్శి ఎండి. రఫత్ ఉమర్, కోశాధికారి రాజు గౌడ్, సెలక్షన్ కమిటీ చైర్మన్ కొండయ్య, కార్యవర్గ సభ్యులు అంబాల రాము, గోపి, సంతోష్, బడే మియా, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన సర్పంచ్‌లు



నవతెలంగాణ-తొగుట

గుడికందుల మాజీ సర్పంచ్‌ను వివిధ గ్రామాల సర్పంచ్‌లు పరామర్శించారు.సోమవారం మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగని గళ్ళ మల్లయ్య, సతీమణి గంగని గళ్ళ రాజవ్వ గత కొన్ని రోజుల నుంచి అనారో గ్యంతో బాధపడుతుంది. 2 రోజుల క్రితం ఆరోగ్యం క్షిణించడంతో గాంధీ ఆస్పత్రి లో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న తొగుట మాజీ సర్పంచ్ పాగాల కొండలరెడ్డి, చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నరసింహులు యాదవ్, కాన్గల్ బీఆర్‌ఎస్ నాయకులు చంద్రారెడ్డిలు ఆయనను పరామర్శించారు.

నర్సాయపల్లి గ్రామస్తుల రుణం తీర్చుకోలేనిది

- తాజా మాజీ సర్పంచ్ బద్దిపడగ లలిత కృష్ణారెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

నర్సాయపల్లి గ్రామస్తులు తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా సర్పంచ్‌ని చేసినందుకు గ్రామస్తుల రుణం తీర్చుకోలేనిదని తాజా మాజీ సర్పంచ్ బద్దిపడగా లలిత కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లలిత కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రామస్తులు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. తన భర్త మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశానమన్నారు. పాలకవర్గ సభ్యులు తనను ఏ విషయంలో ఇబ్బంది పెట్టలేదన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు ఆమె తెలిపారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే గ్రామంలో రాజకీయాలు చేయాలి తప్ప గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ఏకం కావాలని ఆమె కోరారు. అనంతరం గ్రామస్తులు, స్పెషల్ ఆఫీసర్ రాధిక, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, అంగన్వాడి టీచర్, సిఏలు, కలిసి తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ శనివారం సత్యనారాయణ, గ్రామస్తులు తౌటి యాదగిరి, చల్ల మహేందర్ రెడ్డి, మంతెన బాల్ రెడ్డి, బాల్ నర్సయ్య, తౌటి ఎల్లయ్య, మంతెన భరత్ రెడ్డి, పోతుగంటి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ బొమ్మ గాని శివయ్య గౌడ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంతో. జయ జయహే తెలంగాణ పాట రచయిత డాక్టర్ అందెశ్రీ స్వగ్రామమైన సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఎంతో క్రియాశీలంగా పనిచేసిన డాక్టర్ అందే శ్రీ రచించిన జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా ప్రకటిస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తమ గ్రామానికి చెందిన డాక్టర్ అందెశ్రీ రాసిన పాటను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య, కాంగ్రెస్ మండల నాయకులు పుల్లూరి రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజు, యూత్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి సురేష్, ఒగ్గు రవి, శ్రీకాంత్, కలకోటి హనుమంతరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బొద్దుల చంద్రమౌళి, గంధం మల్లారెడ్డి,అందే భాస్కర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

తోటి స్నేహితులు చనిపోయిన కుటుంబానికి నలభై వేల ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటుకున్నారు. నంగునూరు గ్రామానికి చెందిన చిప్ప ప్రకాష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిది పేద కుటుంబం కావడంతో అతని స్నేహితులు 1996-97 పదవ తరగతి విద్యార్థులు రూ. 40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రకాష్ చిన్న కుమార్తె శ్రావణి పేరిట పోస్ట్ ఆఫీసులో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు కె. మహేందర్ రెడ్డి, పాత సురేష్, తుపాకుల శ్రీనివాస్, చక్రాధర్, రజనీకర్ రెడ్డి, నేపాల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుబ్బ తండా కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని దుబ్బ తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. జనగామ డిసిసి జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవులతో కలిసి సోమవారం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బ తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా జాటో రమేష్, ఉపాధ్యక్షులుగా జాటోత్ సీతారాం, భూక్య గోపాల్, ప్రధాన కార్యదర్శిగా జాటో తిరుపతి, కార్యవర్గ సభ్యులు బానోతు లాలు, ఇస్లావత్ నిమ్మ, జాతోతు మోహన్, భూక్య రాజు, జాటోతు దేవిలతో పాటు యూత్ కమిటీ అధ్యక్షునిగా జాటోత్ ప్రవీణ్, ఉపాధ్యక్షుడు తరుణ్, కార్యదర్శి బానోతు నవీన్‌లతో కమిటీలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బ తండా వార్డు మెంబర్లు భూక్య రాజేష్, భానోత్ సీతారాం, బానోత్ బీమా, జాటోతు రవి, పాల్య రమేష్, భూక్య చందర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి చూపండి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పెట్టడంతో ఆటో డ్రైవర్ల నోట్లో మట్టి కొట్టినట్లు గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్ మండలం కొలుగూరు ఆటో డ్రైవర్లు మమ్మద్ ఫారూస్, నర్సింలు, భాస్కర్, పిట్టల బాబు, ఆంజనేయులు ఆవేదన చెందారు. గజ్వేల్ నుంచి వయా కొలుగూరు మీదుగా సిద్దిపేట వరకు 12 మందిమి ఆటోలు నడుపుతూ జీవిస్తున్నామన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వారు ఆవేదన చెందారు. రోజుకు ఆరేడువందలు సంపాదించుకుంటామని ఉచిత బస్సు ప్రయాణంతో పూర్తిగా నష్టం జరిగిందన్నారు. దీంతో కుటుంబాలు ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన చెందారు. ఆటో డ్రైవర్ల వృత్తి తప్ప వేరే పని చేసే పరిస్థితి లేదని, తమను ఆర్టీసీలోకి తీసుకోవాలని లేదా ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ మండలంలో 25 గ్రామపంచాయతీలో ఒక్కొక్క గ్రామంలో 15 ఆటోల వరకు ఉన్నాయని వారందరూ ఉపాధి పోయిందని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మూలంగా బస్సు వచ్చే వరకు కూడా మహిళలు ఆటోలు ఎక్కడం లేదని వారన్నారు. ప్రతిరోజు గజ్వేల్ సిద్దిపేట మధ్యన రెండు మూడు ట్రిప్పులు ఆటోలు నడిపే వారమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంలో దృష్టి పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తాత్కాలిక మాటలు వద్దని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డుపైకి వస్తాయని వారు తెలిపారు. కాంగ్రెస్ తాత్కాలిక మాటలతో ఆటో డ్రైవర్ల కడుపునిండదని వారు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై సోమ వారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరికి తీవ్ర గాయా లయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రా మానికి చెందిన నరసయ్య (50) మోటార్ సైకిల్‌పై కొమురవెల్లి దైవదర్శనానికి వెళుతున్న గ్రామంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో ఆయన కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చేయి విరిగిపోయింది. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్‌లు చేరుకొని చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

నులిపురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్ర అందించాలి

- వైద్య అధికారి డాక్టర్ రాధకిషన్



నవతెలంగాణ-తొగుట

నులిపురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్ర అందించాలని వైద్య అధికారి డాక్టర్ రాధ కిషన్ తెలిపారు. సోమవారం మండలంలోని ఆరోగ్య కార్యకర్తలకు, అంగన్వాడి, ఆశా కార్యకర్త లకు ఈ నెల 12వ తేదీన జరగబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 సంవత్స రం వయసు నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ నులిపురుగులను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్ర అందించాలని కోరారు. ఈ కార్యక్రమంతో పాటుగా ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు వరకు విటమిన్ "ఏ" కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా 9 నెలల నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలం దరికీ విటమిన్ "ఏ" టానిక్ అందించాలని ఆదేశిం చారు. మండలంలోని గర్భిణీ స్త్రీలు సాధారణ ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ దవాఖానాలలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను దిశానిర్దేశం చేశా రు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్, ఎంఎల్‌హెచ్‌పిలు డా.సాగరిక, సుభా షిని, సిహెచ్‌ఓ. స్వరూప, సూపర్వైజర్ శ్యామల, ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్ముల్, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లోపు గ్యారెంటీలను అమలు చేయాలి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం ఇచ్చిన 6 గ్యారంటీలు పార్లమెంట్ ఎన్నికలలోపు అమలు చేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. అధికారం కోసం ఇచ్చిన 6 గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు 2500, ఉచిత గ్యాస్ అమలు చేస్తేనే మహాలక్ష్మి పథకం అనేది పూర్తిస్థాయిలో అమలవుతుందన్నారు. ప్రభుత్వ మాత్రం ఉచిత బస్సు కల్పించి మిగతా ఉచిత గ్యాస్, 2500 సహాయం చేయడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఆ రెండు కూడా అమలు చేస్తే మహాలక్ష్మి పథకం పూర్తి స్థాయిలో అమలైనట్టు ఉంటుందన్నారు. పెన్షన్ 4000 పెంచుతామని జనవరి నుంచి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం, మంత్రివర్గం ఇప్పటివరకు పెన్షన్ పెంచలేదని పాత పెన్షన్ కూడా చాలా చోట్ల ఇంకా వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2,116ల నుంచి రూ.4000ల పెన్షన్ పెరుగుతుందని కాంగ్రెస్‌కు ఓట్లు వేశారన్నారు. ఇప్పటివరకు పెన్షన్ పెంచలేదన్నారు. ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణం మూలంగా రాష్ట్రంలో 1.50 లక్షల మంది ఆటో కార్మికుల నోట్లో మట్టి పడిందని కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వంగ భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివి



నవతెలంగాణ-మద్దూరు

తాజా మాజీ సర్పంచ్ వంగ భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివని ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మద్దూరు మండలంలోని సలాక్ పూర్, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ రాజేశ్వర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, గ్రామస్తుల ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచ్ వంగ భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఘనంగా శాలువా మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ తాజా మాజీ సర్పంచ్ వంగ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి గ్రామ అభివృద్ధి కోసమే పాటుపడాలన్నారు. మద్దూరు మండల సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షునిగా పనిచేస్తూనే గ్రామానికి అనేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారన్నారు. భాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్ల, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

దళిత ప్రజాప్రతినిధి అంటే ఇంత నిర్లక్ష్యమా?

- స్థానిక కాంగ్రెస్ నాయకులకు ప్రోటోకాల్ పాటించే సోయి లేదా?
- ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించిన గజ్వేల్ జెడ్పిటిసి పంగ మల్లేశం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత ప్రజాప్రతినిధులపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని గజ్వేల్ మండల జెడ్పీటీసీ పంగ మల్లేశం మండిపడ్డారు. ఇటీవల కొడకండ్ల చెక్ డ్యామ్ వద్ద గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాలువల్లోకి నీరు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ జెడ్పిటిసిగా దళితుడినైన తనను అధికారులు అవమానపరిచినట్లు ఆయన ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు పనితీరు బాగోలేదని ఆయన మండిపడ్డారు. హల్ది వాగులోకి సాగునీరు విడుదల చేసినప్పుడు స్థానిక ప్రజా ప్రతిని ధులను ప్రోటకాలు ఎందుకు పాటిం చడం లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులకు ఎంత అవమానం జరుగుతుందని ఊహించలేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు దీనికి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానికంగా ప్రజాప్రతినిధులు ఉన్నారని వారికి ఆహ్వానం పలకాలనే సోయి ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. అధికారం వచ్చిందని కాంగ్రెస్ నాయకులు సంబరపడుతున్నారని ఆయన అన్నారు. తాను దళితుడిననే కాంగ్రెస్ నాయకులు అవమానించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈఈ నారాయణకు ఫోన్ చేసి అడగ్గా తనకు ఎలాంటి విషయం తెలియదని కొట్టి పారేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సీ వేణు దృష్టికి తీసుకపోయే ప్రయత్నం చేయవా ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం రెస్పాన్స్ ఇవ్వడం లేదని ఆయన అన్నారు. దళితుడిని అవమానపరిచిన అధికారులు, అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన దుబ్బాక విద్యార్థులు



నవతెలంగాణ-దుబ్బాక

గుజుర్యు కరాటే అకాడమీ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 4న కరీంనగర్‌లో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో దుబ్బాక విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, స్టైల్ చీఫ్ మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. సోమవారం దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లాకు చెందిన 20 మంది విద్యార్థుల్లో 3 - గోల్డ్, 11-సిల్వర్, 6-బ్రౌంజ్ మెడల్స్ సాధించారన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలు అక్షయ, లౌకిక-గోల్డ్ మెడల్స్, రేవతి, లయ, సాక్షి, వైష్ణవి, కావ్య-సిల్వర్ మెడల్స్, చంద్రిక, జోష్ణ, శ్రీలాస్య, కృష్ణవేణి, అశ్విత, శ్రీజ, నిహారిక, కావ్యశ్రీ, శ్వేత, సాయిచందనలు-బ్రౌంజ్ మెడల్స్, గాయత్రి వివేకానంద పాఠశాల విద్యార్థులు యశ్వంత్-గోల్డ్ మెడల్, హిమాన్స్-సిల్వర్ మెడల్ లను సాధించినట్లు మాస్టర్ శ్రీకాంత్ మెదల్స్ సాధించిన విద్యార్థులను డీఈవో శ్రీనివాసరెడ్డి, జీఈసీఓ ముక్తేశ్వరి, కేజీబీవీ ఎస్ఓ స్వాతి, పీఈటీ నిషా ప్రత్యేకంగా అభినందించారు. గడ్డం సాయికుమార్, రవి, సత్య శంకర్, సంతోష్, పూర్ణచంద్, శ్రీరామ్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల సిబ్బంది ఉన్నారు.

అన్ని క్రీడల్లో రాణించాలి



- గజ్వేల్ ఏసిపి రమేష్

నవతెలంగాణ-గజ్వేల్

విద్యార్థిని విద్యార్థులు అన్ని క్రీడల్లో రాణించాలని గజ్వేల్ ఏసిపి రమేష్ బాబు అన్నారు. ఇటీవల కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు, రామకృష్ణ, రఘురాములను సోమవారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించడం మామూలు విషయం కాదన్నారు. పట్టుదల కృషి ఉండటంతోనే ఇరువురు విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ దూలం కృష్ణ, ఉప్పల కృష్ణ, విద్యార్థుల తండ్రి రామకోటి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు వెంటనే పంపిణీ చేయాలి

- రూ.30 కోట్ల డీడీలు పెండింగ్
- గజ్వేల్ యాదవ సంఘం నాయకులు

నవతెలంగాణ-గజ్వేల్

గత ఏడాది కాలంగా గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన గొర్రె కాపరులకు సంబంధించి రూ.30 కోట్ల డీడీలు పెండింగ్‌లో ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించుకొని వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని గజ్వేల్ నియోజకవర్గం యాదవ సంఘం నాయకులు భూమయ్య యాదవ్, రవీందర్ యాదవ్. వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్,, కనకరాజు యాదవ్, నరేష్ యాదవ్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా గొర్రెల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఈ లోపు ఎన్నికలు వచ్చాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత శాఖ మంత్రి పట్టించుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా భవనం లేదా గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని వారు తెలిపారు. గత ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి కృషి చేసిందని వారు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో యాదవులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం జరిగిందని వారు గుర్తు చేశారు. తాము డిడిలు చెల్లించిన తర్వాత ఎన్నికల సీజన్ రావడంతో పెండింగ్‌లో ఉన్నాయని ఈ విషయాన్ని అర్థం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులను ఆదుకోవాలని వారు కోరారు.



వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో రక్త దానం



నవతెలంగాణ-సిద్దిపేట

వనిత వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో బ్లడ్ నిలువల కోసం నలుగురు రక్తదానం చేసినట్లు వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ జైంట్ ట్రెజరర్ పుల్లూరు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ రక్తదాతలు మాడుగుల యాదగిరి రెడ్డి, ఏ.ఎల్లారెడ్డి, సిహెచ్ శ్రీనివాస్, యాదగిరిలు రక్తదానం చేసినట్లు తెలిపారు. వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు మరియాల వాణి, సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పుల్లూరు సుష్మ, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డాక్టర్ స్వాతి, పాథాలజికల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఆంజనేయులు, ఇమ్రాన్, స్వామి, మర్యాల వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

నవతెలంగాణ-చిన్నకోడూరు : చిన్నకోడూరు మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డిఇఓగా విశ్వాసనీత్, ఎంఇఓగా నిఖిల్, ప్రధానోపాధ్యాయులుగా అభిజ్ఞ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 06 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

వంగ రామయ్య పల్లి మాజీ సర్పంచికి సన్మానం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ మండలంలోని వంగ రామయ్య పల్లి గ్రామ మాజీ సర్పంచ్ వంగ విజయలక్ష్మి వెంకటరామిరెడ్డి దంపతులను సోమవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. వంగరమయ్య పల్లి సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఐదు సంవత్సరాల కాలంలో వంగ విజయలక్ష్మి సర్పంచిగా సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తొగుట

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె కొనసాగుతుందని గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ మండలాధ్యక్షులు మస్కూర్ శంకర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీధర్‌కు 16వ తేదీ దేశవ్యాప్త సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ ప్లాంట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతుందన్నారు. (ఐఎన్టి యుసి, ఏఐటియూసీ, సిఐటియు, హెచ్ఎంఎస్యు, ఐఎఫ్టియు, బిఆర్టియు, టిఎన్టియు, సిఏఐయుటి యుసి) కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్, సంయుక్త కిసాన్ మోర్చా (రైతు-వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక) ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్ పాటించాలని కోరుతున్నామన్నారు. ఈ సమ్మెలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులందరు పాల్గొంటారని తెలిపారు. సమ్మె నోటీసు అందించిన వారిలో గ్రామ పంచాయతీ కార్మికులు మల్లేశం, నర్సింలు, ప్రభాకర్, యాదగిరి, కొమురయ్య, నారాయణపాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త ఐక్య కార్మికుల సమ్మె విజయవంతం చేయాలని ఆశా యూనియన్ మండల అధ్యక్షురాలు ప్రవీణ కోరారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్యామలకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి16 న కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సౌందర్య, లక్ష్మీ, శారదా, సౌనంద, బాగ్యా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం పాలనలో హుస్నాబాద్ సుభిక్షం

సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ-అక్కన్నపేట



హుస్నాబాద్ నియోజకవర్గ 75 ఏళ్ల చరిత్రలో పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొందడం ఇక్కడి ప్రజల అదృష్టమని సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఆయన మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే నియోజకవర్గానికి 100 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చి అందులో హుస్నాబాద్ నుంచి రామవరం గ్రామానికి 11.5 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్డు మంజూరు చేయడం ఆనందదాయకమన్నారు. రాబోవు రోజుల్లో హుస్నాబాద్ మరింత అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆకాంక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్‌కి జైలు శిక్ష

నవతెలంగాణ-వర్గల్

ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌కి నేరం రుజువుకావడంతో సోమవారం రోజున జైలు శిక్ష పడింది. గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తూప్రాన్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సులుగారి సంతోష్ (26) 2018 వ సంవత్సరంలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ రోడ్డు ప్రమాదానికి కారణమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ తారాచంద్‌పై గౌరారం పోలీసులు కేసు నమోదుచేసి కోర్టులో ఛార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సోమవారం రోజున ఈ కేసుపై వాదోపవాదాలు జరిగాయి. కేసు రుజువు కావడంతో అదనపు ప్రథమ శ్రేణి న్యాయాధిపతి అయిన బి. ప్రియాంక ముద్దాయికి ఒక నెల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారని గౌరవరం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.

కుల గణన ఎంతో అవసరం

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణ రాష్ట్రంలో కులగణన ఎంతో అవసరమని, కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేపట్టడానికి చర్యలు చేపట్టడం హర్షనీయమని కేకేసీ సోషల్ మీడియా కో ఆర్డీనేటర్ మెట్ట నాగారాజు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. కుల గణనతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు దక్కాల్సిన ఫలాలు అందుతాయని కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ అమోదం తెలుపడంపై నాగారాజు ఆనందం వ్యక్తం చేశారు.

అక్రమంగా వాగులలో ఇసుక తీస్తే చర్యలు తప్పవు

తోటపల్లి వాగును సందర్శించిన సీఐ ఎర్రల కిరణ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండల పరిధిలోని గ్రామాలలో వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్ హెచ్చరించారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని సిఐ ఎర్రల కిరణ్, ఎస్ఐ తోట మహేష్ సందర్శించారు. వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారి వివరాలు సేకరించినట్లు సిఐ తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్నా వారిపై కేసులు నమోదు చేసి, అట్టి వాహనాలను సీజ్ చేసి చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్స్‌ను తనిఖీ చేసిన జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

గజ్వేల్ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ని వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జి.సరోజ ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం గజ్వేల్‌లోని వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహం ప్రీమెట్రిక్ వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుర కళాశాల వసతి గృహం, బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహాలను, వసతి గృహాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ కావాలో సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివేందుకు నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబిసి డబ్ల్యూ మురళి, సంక్షేమ అధికారులు లక్ష్మీ, దేవదాస్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

నవ తెలంగాణ-దౌల్తాబాద్

తెలంగాణ మోడల్ స్కూల్ దౌల్తాబాద్‌కు చెందిన విద్యార్థులు ఫిబ్రవరి 1, 2న బెంగళూరులో నిర్వహించిన స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫేస్ట్‌లో తెలంగాణ, రాష్ట్రం తరపున పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో విద్యార్థులు కె అంకిత్, ఎం అఖిల్ మొదటి బహుమతిని పొందారు .ఈ విద్యార్థులకు గైడ్ టీచర్‌గా విధులు నిర్వహించిన యస్ రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు తనలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి రైతులకు ఉపయోగపడేలా ప్రాజెక్టు చేసి మొదటి బహుమతి పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ రైతులకు ఉపయోగపడే వాతావరణం మానిటరింగ్ సిస్టం వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు రైతులకు మెసేజ్ రూపంలో ఫోన్‌కు చేరవేస్తుందని, ఇలాంటివి ఇంకెన్నో తయారుచేసేల అధ్యాపకులు అందరూ కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఇన్నోవేటివ్ ఫేస్ట్ లో 4 రాష్ట్రాలకు చెందిన 43 ప్రాజెక్టులు పాల్గొనడం జరిగిందని, తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ దౌల్తాబాద్ విద్యార్థులు చక్కని ప్రదర్శనతో మొదటి స్థానంలో నిలవడంతో సిద్దిపేట జిల్లాకు జాతీయస్థాయిలో పేరు తీసుకురావడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తాలూకా



యజ్ఞశ్రీ మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉండి వారికి ప్రతి విషయంలో సహకరించి, దౌల్తాబాద్ మోడల్ స్కూల్ మొదటినీ స్థానంలో ఉండేలా కృషి చేసిన మోడల్ కళాశాల జువాలజీ ఉపాధ్యాయులు రాజేందర్‌ను ప్రత్యేకంగా అభినందన తెలుపుతూ, విద్యార్థులను పరిశోధనల వైపు మొగ్గుచూపేలా చూడాలన్నారు. విద్యార్థులలో ఉన్నటువంటి సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రయత్నం చేస్తున్నటువంటి మోడల్ స్కూల్ కళాశాల అధ్యాపకుల లను, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



ప్రజావాణిలో 28 ఫిర్యాదులు



నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జిదారుల నుంచి 28 ఫిర్యాదులు స్వీకరించినారు. ఈ కార్యక్రమంలో అదనపు పాలనాధికారి మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో భూ సంబంధిత రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు, ఇతరత్రా మొత్తం కలపి 28 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ, డిఆర్డిఎ పిడి జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల-నుండి సూర్యాపేట జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తమ విలువైన భూములు కోల్పోతున్నామని ఎన్సాన్ పల్లి , తడక పల్లి, బూర్గు పల్లి, చిన్నగుండవెల్లి గ్రామాలకు చెందిన రైతులు బాధితులు వాపోయారు. గతంలో తమ గ్రామాల నుంచి కాకుండా వేరే ప్రాంతాల నుంచి సర్వే నిర్వహించి రోడ్డు నిర్మాణం కూడా పూర్తయిందని, దానికి కల్పకుండా వ్యక్తిగత బిఆర్ఎస్ రాజకీయ నాయకుల భూములు ప్రయోజనాల కొరకు ఇప్పుడు తమ గ్రామాల నుంచి రహదారి నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద రైతులు నష్టపోతామని వెంటనే ఈ నిర్మాణ మార్గాన్ని మార్చి తమ భూములను కాపాడాలని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. మరి గ్రీన్ వేస్ బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఇంధనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని గ్రామం గుగ్గిళ్ళ మండలం బెజ్జంకి గ్రామ శివారులో నిర్మాణం చేయడం వల్ల వాయు కాలుష్యం వలన గ్రౌండ్ ఫ్లోర్‌లో మంచినీటి, సాగునీటి వాటర్ పొల్యూషన్ కలుషితమై గ్రామస్తులకు అనారోగ్యంతో ఇబ్బందులకు గురవుతారని గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమంలో పర్మిషన్ రద్దు కొరకై దరఖాస్తు పెట్టుకున్నారు.





సర్పంచులకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం పరిధిలోని 32 గ్రామాల సర్పంచ్‌లకు సోమవారం రైతు వేదికలో ఎంపీపీ లక్ష్మీ బీలు నాయక్, ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 32 గ్రామాల సర్పంచ్‌కు శాలువాతో సత్కరించి మెమోంటోను బహుకరించారు. అనంతరం సర్పంచులు మాట్లాడుతూ సర్పంచుల పదవులు అనేవి శాశ్వతం కాదని, ప్రజాసేవే శాశ్వతమన్నారు. ఈ ప్రజా సేవలో ఎన్ని కష్టాలు వచ్చినా కానీ, ప్రజలకు అందుబాటులో ఉన్నామే తప్ప వెనక్కి తగ్గలేదని తెలియజేశారు. అంతేకాకుండా సర్పంచ్‌లకు రావలసిన పెండింగ్ బిల్లులన్నీ స్పెషల్ ఆఫీసర్లు చొరవ తీసుకొని త్వరగా వచ్చేలా సహకరించాలని కోరారు. అలాగే తమ ప్రయాణంలో ఎవరినైనా ఇబ్బంది పెట్టి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలన్నారు. అనంతరం సర్పంచులంతా కాసేపు వారి ఐదేళ్ల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మోగి పురుగుతో పంట నష్టం

ఏఈఓ మనోజ్ఞ..

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల పరిధిలోని కేశవాపూర్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను ఏఈఓ మనోజ్ఞ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోగి పురుగు తీవ్రత వల్ల వరి పైరును నారు మడి దశనుంచే ఆశించడం వలన రైతులు పంట నష్టపోతున్నారన్నారు. వరి పైరును మోగిపురుగు ప్రధానంగా 3 దశలో ఆశించి నష్టాన్ని కలుగజేస్తుందని తెలిపారు. ప్రస్తుతం పిలకలు వేసే దశలో ఉన్న వరి పైరును ఆశిస్తోందన్నారు. కావున రైతులు సస్య రక్షణ చర్యలు చేయడం వలన పురుగు ఉధృతిని అదుపులో ఉంచగలరని తెలియజేశారు. పిలక దశలో ఎకరాకు 3 లింగాకర్షక బట్టలు, అందులో వారానికి 25-30 పురుగులు పడినప్పుడు నారు మడిలో కార్బోఫిరాన్ 3జీ గుళికలు 10కేజీ లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ, 4 కేజీ గుళికలు 20-25 కేజీల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. పిలక దశలో కర్తప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం, ఎస్పీ 2జీఎం,(400 జీ/ఏసర్) పిచికారి చేయడం వలన పురుగు ఉధృతి తగ్గుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు రైతులు ఉన్నారు.

గ్రామాభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తాను



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామ అభివృద్ధియే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని గ్రామ సర్పంచ్ బక్కి భాగ్య లక్ష్మి అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి పూర్తయిన క్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి చెందాలంటే ప్రతి కార్యకర్త గ్రామస్థాయి సిబ్బంది కృషి ఎంతో ఉంటుందని తెలిపారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. సేవ చేయడంతో మానవ మనుగడకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌తో పాటు గ్రామంలోని అంగన్వాడి ఆశ వర్కర్లు ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో



సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ దహనం

నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి పది సంవత్సరాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ సీఎం కే.చంద్రశేఖర రావుపై సీఎం రేవంత్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సీఎం కాగానే రేవంత్ రెడ్డిలో అహం బాగా పెరిగిందని, ఇదంతా రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు మానుకోకుంటే ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

వైభవంగా శంభు దేవాలయ ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలంలోని దుద్దెడ స్వయంభు దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. మొదటిరోజు పుణ్యాహవాచనము, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకం, అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ఓడిబియ్యాలు, అన్నాభిషేకం జరిగాయి. సాయంత్రం శకటోత్సవం కార్యక్రమంలో వాహనాలు, మోటార్ సైకిళ్ళు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల దేవాలయం చుట్టూ తిరిగాయి. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో ట్రస్టు ప్రతినిధులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పూజలు చేశారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-తొగుట



మాగం అమావాస్య జాతర ఏర్పాట్లను పరిశీలించామని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్రావు పేట గ్రామ శివారులోని వెంకటేశ్వర స్వామి, మల్లన్న గుట్ట వద్ద జరిగే జాతర ఏర్పాట్ల గురించి పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగ రావు తదితరులు ఉన్నారు.